నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 21 డిసెంబర్ 2024 | RANGAREDDY


బీఆర్ఎస్ పార్టీ నాయకులను వ్యాన్‌లోకి ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

# కేటీఆర్ అరెస్టుకు రేవంత్‌కుట్ర..

### పాలన గాలికి.. ఫోకస్ బీఆర్ఎస్ పైకి...
### కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న జనం
### కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టినందుకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా


వికారాబాద్, డిసెంబర్ 20 : కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తున్నారనే కుట్రతోనే రేవంత్‌రెడ్డి.. కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టించారని బీఆర్ఎస్ కౌన్సిలర్ గోపాల్ మండిపడ్డారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సూచనల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించి, సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ ర్యాలీ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఇంటి నుంచి పట్టణంలోని ఆటో స్టాండ్ వరకు కొనసాగింది. మధ్యలోనే పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే భైఠాయించి ధర్నా చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టులు చేసి వ్యాన్‌లో వికారాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ ఈ-రేస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచారన్నారు. రాష్ట్రానికి దాదాపు రూ.700 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్ములా ఈ-రేస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయలేక విఫలమయ్యారన్నారు. చేతనైతే కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం, రూ.6 వేల పింఛన్, మహిళలకు రూ.2,500లు, రైతులందరికీ రుణ మాఫీ, రైతు బంధు, సమగ్ర శిక్షా ఉద్యోగుల రెగ్యులరైజ్ తదితర వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మించి ప్రజలతో ఓటు వేయించుకున్నదని మండిపడ్డారు. హైదరాబాద్ బ్రాండ్‌ను పెంచిన కేటీఆర్‌పై కక్షగట్టి ఏసీబీలతో కేసు పెట్టించడం సరికాదన్నారు. ధర్నాలో వికారాబాద్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు గయాజ్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, జిల్లా నాయకులు సురేశ్, అశోక్, ఆనంద్, అనీల్, నర్సింహులు, ఆంజనేయులు, మల్లేశ్, గఫార్, శ్రీనివాస్‌గౌడ్, అనంతయ్య, మహిపాల్ పాల్గొన్నారు.


బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

## సెంటు భూమి కూడా ఇచ్చేది లేదు..

**- ఫార్మా విలేజ్ బాధిత రైతులు**

'ఫార్మా విలేజ్ పేరుతో మా జీవనోపాధిని దెబ్బతియాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూసింది.. ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడిన సెంటు భూమి కూడా ఇవ్వం..' అని దుద్యాల మండలంలోని రోటిబండతండా, పులిచెర్లకుంట తండా, లగచర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాల రైతులు స్పష్టం చేశారు. మళ్లీ కొత్తగా పరిశ్రమల కారిడార్ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తీసుకురావడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. సీఎం మూర్ఖత్వంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి నియోజకవర్గంపై ఆధిపత్యం చెలాయించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. అధికారులు ఆయన కనుసన్నల్లో మెసలుతున్నారని ఆరోపించారు. జైలులో ఎన్నో బాధలు పడ్డామని, చేతికొచ్చిన పంటను కోయించలేక, అరెస్ట్ అయిన తమనే తలుచుకుంటూ కుటుంబీకులు ఎంతో వ్యథను అనుభవించారన్నారు. పంటంతా నేలపాలైందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు. లగచర్ల ఘటన నాటి నుంచి ఫార్మా విలేజ్ బాధిత పల్లెల్లోని జనం భయం గుప్పిట్లో బతికారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిల సహకారం, లీగల్ సెల్ సాయంతో ఇంటికి చేరుకున్నామని, వారికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

లగచర్ల రైతులకు దిష్టి తీసి ఆహ్వానిస్తున్న గ్రామస్తులు



జైలు నుంచి గ్రామానికి చేరుకోవడంతో ఆలింగనం చేసుకుని కన్నీరు పెడుతున్న రైతు కుటుంబీకులు

# బీఆర్ఎస్ చొరవతోనే బయటికొచ్చాం..

లగచర్ల ఘటన రాష్ట్రం మొత్తంలోనే సంచలనాన్ని సృష్టించింది. ఏ నోట విన్నా.. ఎక్కడ చూసినా లగచర్ల ఘటన ముచ్చట్లే.. రైతుల బతుకులను ఛిద్రం చేయాలని చూసిన సర్కారుపై పోరాడిన అన్నదాతలు శుక్రవారం బెయిల్‌పై బయటకువచ్చారు. 39 రోజులుగా జైలులో ఉండి, గ్రామానికి చేరుకున్న తమ వారిని చూసిన కుటుంబీకులు ఆత్మీయ ఆలింగనాలు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. దిష్టితీసి పటాకులు కాల్చుతూ ఘన స్వాగతం పలికారు. కనికరం లేని కాంగ్రెస్ సర్కార్ ఇన్ని రోజులు తమవారిని చూడనివ్వలేదని కుటుంబీకులు ఆవేదన చెందారు. కుటుంబీకులను చూసిన అన్నదాతలకు కంటనీరు కట్టలు తెంచుకున్నది. ఎలా ఉన్నారంటూ ఒకొరికొకరు పలుకరించుకోవడం కనిపించింది. భూ పోరాటంలో చివరికి న్యాయమే గెలించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

- కొడంగల్, డిసెంబర్ 20

### న్యాయ పోరాటాన్ని ప్రభుత్వం వక్రీకరించింది..

తమ భూములను కాపాడుకునేందుకు న్యాయపోరాటం చేస్తే కాంగ్రెస్ సర్కార్ వక్రీకరించిందని రోటిబండ తండా గ్రామానికి చెందిన బాధితులు, కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు నర్సింహనాయక్, బీఆర్ఎస్వీ సంగారెడ్డి కోఆర్డినేటర్ రాజేంద్రనాయక్, గిరిజన సంక్షేమ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్‌లు బాధిత రైతులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ సొంత భూములను కాపాడుకునేందుకు పోరాడితే సర్కార్ జైలులో పెట్టడం సరికాదన్నారు. రైతులను కాపాడాల్సిన ప్రభుత్వం సంఘవిద్రోహ శక్తులుగా చిత్రీకరించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం బాధగా ఉన్నదన్నారు. ఇంకా ఎన్ని బాధలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, భూములను మాత్రం ఇవ్వబోమని బాధిత రైతులు స్పష్టం చేశారు. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉన్నదని, ఐక్యరాజ్య సమితి దృష్టికి సైతం తీసుకెళ్తానని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పడం ఎంతో భరోసానిచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతోనే తమకు న్యాయం జరిగిందన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, రైతుల తరపున పూర్తి మద్దతు ఉంటుందన్నారు. జైలులో ఉన్న హీర్యానాయక్‌కు గుండెపోటు వస్తే, పోలీసులు బేడీలు వేసి తీసుకెళ్తుంటే బోరున విలపించామన్నారు.

సీఎం బ్రదర్స్ వైఖరివల్లే ఈ దుస్థితి

కేటీఆర్ చొరవ... లీగల్ సెల్ సాయంతో బయటపడ్డాం..

ఆయన సాయం మరువలేము...: స్వగ్రామానికి చేరుకున్న లగచెర్ల రైతులు

రైతుల రాకతో తండాల్లో వెల్లివిరిసిన ఆనందం

భావోద్వేగానికి గురైన కుటుంబ సభ్యులు

హారతులిచ్చి.. ఆలింగనం చేసుకొని ఆనందభాష్పాలు


అప్పట్లో ఫార్మా.. ప్రస్తుతం పరిశ్రమల కారిడార్..

భూములు లాక్కోవడమే లక్ష్యంగా ప్రభుత్వం..

సీఎం మూర్ఖత్వంతో రైతుకు సంకెళ్లు..

భూములు కాపాడుకునేందుకు దేనికైనా సిద్ధం..

మాజీ ఎమ్మెల్యే పట్నం సహకారాన్ని మర్చిపోలేం


మాట్లాడుతున్న బాధిత రైతులు

# కాంగ్రెస్ వచ్చింది.. మా ఉపాధి పోయింది

### ఆదుకుంటామన్నారు.. గెలిచాక మొండి చేయి చూపారు ... ఆటో డ్రైవర్లను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
### అసెంబ్లీని ముట్టడించే యత్నం చేసిన ఆటో డ్రైవర్లు



హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివస్తున్న ఆటో డ్రైవర్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : 'ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచి, గెలిచాక కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపిందని ఆటో డ్రైవర్ల జేఏసీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఆటో డ్రైవర్ల అసెంబ్లీని ముట్టడి కార్యక్రమంలో భాగంగా వందలాది మంది ఆటో డ్రైవర్లు హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి బయలుదేరగా, అసెంబ్లీకి సమీపంలోని పెట్రోల్ బంక్ సిగ్నల్‌పాయింట్‌కు వెళ్లే మార్గంలో పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఆటో డ్రైవర్లను అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. అంతేకాకుండా రాష్ట్రం నలువైపుల నుంచి నగరానికి చేరుకుంటున్న వందలాది మంది ఆటో డ్రైవర్లను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల జేఏసీ నాయకులు మారయ్య, వెంకటేశ్, సత్తిరెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మా ఉపాధి అంతా సర్వ నాశనమైపోయిందని, రేవంత్ సర్కార్ ఆటోడ్రైవర్ల జీవితాలను సర్వ నాశనం చేసిందన్నారు. ఉచిత బస్సు స్కీం తీసుకొచ్చి ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చి ఇప్పుడు కనీసం ఆటో డ్రైవర్ల సమస్యలు వినడానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సమయం ఇవ్వడం లేదని వాపోయారు. చర్చలకు పిలుస్తామని మాటిచ్చిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆటో డ్రైవర్ల సమస్యలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపించడం లేదని విమర్శించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆటో డ్రైవర్ల ఉద్యమం ఆగదని.. హామీలన్నీ నెరవేరే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రభుత్వానికి త్వరలో బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సిటీ ఆటో యూనియన్, టీఎస్‌డీయూ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

# స్టోర్ రూంలో ఎలుకలు.. గడువు ముగిసిన మసాలాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మేడిపండు చూడు మేలిమై ఉండునూ.. పొట్ట విప్పి చూడు పురుగులుండు అన్నట్టుగా.. ధగధగలాడే మెరుపులతో హోటల్ ప్రవేశ ద్వారాలు స్వాగతం పలుకుతుంటే.. కిచెన్ రూంలో మాత్రం ఎలుకలు, ఎలుక విసర్జనాలు, గడువు ముగిసిన మసాలాలు ఉంటున్నాయి. వెరసి జనాల ఆరోగ్యం పాడు చేస్తున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో ఇవన్నీ వెలుగు చూశాయి. గచ్చిబౌలిలో ది నవాబ్స్ రెస్టారెంట్‌లో వంటగది లోపల డ్రైనేజీ మూసుకుపోయి నీరు నిలిచిపోయినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీల్లో గుర్తించారు. వంటింటి కిటికీలు, తలుపులకు పురుగుల నియంత్రణ లేదని తేల్చారు. స్టోర్ రూంలో ఎలుకల విసర్జన, ఎలుకలు తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. రిఫ్రిజిరేటర్లలో చికెన్, మటన్‌లపై లేబుల్ లేదని, దుకాణంలో దొరికే ఉల్లిపాయల పొడి, పెరి పెరి మిక్స్ కూడా లేబుల్ లేకుండా ఉన్నాయి. వంటగదిలో డస్ట్‌బిన్లను తెరిచే ఉంచారు. తెరిచి ఉన్న డస్ట్‌బిన్లను గుర్తించారు.

### గచ్చిబౌలి ఇందిరా నగర్‌లో..

గచ్చిబౌలి ఇందిరా నగర్‌లో లా విన్ ఎన్ రోజ్ కేఫ్‌లో కిచెన్ ఫ్లోర్, కేక్ తయారీ ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని తేల్చారు. గచ్చిబౌలిలోని బెర్లిన్ రెస్టారెంట్ అండ్ క్లబ్‌లో గడువు ముగిసిన పుట్టగొడుగులు, ఆపిల్ సైడర్ వెనిగర్, వెరుశనగ వెన్న, చైనీస్ మసాలా పొడి, నువ్వుల నూనె, మద్రాసు కరివేపాకు, మసాలా అల్లంపొడి, స్వీట్ కార్న్ వంటి పదార్థాలను సీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్‌లో లేబుల్ లేని ఆహార పదార్థాలు కనిపించాయి. తెరిచి ఉన్న డస్ట్‌బిన్‌లు దర్శనం ఇచ్చాయని అధికారులు పేర్కొన్నారు. సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తెలిపారు.



హోటల్‌లోని మసాలాలను పరిశీలిస్తున్న అధికారులు